క్లుప్తంగా

తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న కమిషనర్

కోరుట్ల: తడి, పొడి చెత్తపై మున్సిపల్ కమిషనర్ రవీందర్ గౌడ్ బుధవారం పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని ప్రజలకు సూచించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌ను వాడవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ శ్రీరామ్, పర్యావరణ ఇంజినీర్ మహేశ్, వార్డ్ ఆఫీసర్లు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల పురాతన గదులు కూల్చివేత


పాత గదులను కూల్చివేయిస్తున్న అధికారులు

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పురాతన గదులను బుధవారం మున్సిపల్ శాఖ అధికారులు తొలగించారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు జేసీబీ సాయంతో శిథిలావస్తులో ఉన్న పురాతనమైన గదులను కూల్చివేత కార్యక్రమాన్ని చేపట్టారు. అదే విధంగా వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వనమహోత్సవం, బల్కు వేస్ జనరేటర్స్‌ని గుర్తించడం, ట్రేడ్ లైసెన్స్, ప్లాస్టిక్ బ్యాన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, సిబ్బంది తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న మారుతి

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని మండలాధ్యక్షుడు మల్యాల మారుతి అన్నారు. బుధవారం కథలాపూర్‌లో బీజేపీ కార్యాలయంలో సీనియర్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని, ఈ విషయాన్ని బీజేపీ నాయకులు ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో పక్కా ప్రణాళికతో నాయకులు పని చేసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సత్యం, శ్రీనివాస్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా స్వశక్తి సంఘాల సంబరాలు

మల్లాపూర్: మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళ స్వశక్తి సంఘాల సంబరాలను మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షురాలు తేజశ్విని మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ స్వశక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, వడ్డీ లేని రుణాలు, స్వయం ఉపాధి వ్యాపారాల బాధ్యతలను అప్పగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ స్రవంతి, సీఏలు గ్రామసంఘ సభ్యులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్‌లో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. సమావేశానికి జిల్లా అడిషనల్ డీఆర్డీవో హాజరై మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల గురించి వివరించారు. గ్రామంలో వివిధ రకాల ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి విజయాన్ని సాధించిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, సీసీలు, వీవోఏ లు, స్వశక్తి సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

వెల్గటూర్ : ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందని ఏపీఎం చంద్రకళ అన్నారు. వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ప్రభుత్వం మహిళల చేయూత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుంద న్నా రు. కార్యక్రమంలో సంఘాల అధ్యక్షులు, వీవోఏలు, సీసీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణం.. బండరాళ్లమయం

- ఆటలు ఆడేందుకు స్థలం కరువు
- ప్రహరీ లేక విద్యార్థుల ఇబ్బందులు
- బండరాళ్లు తొలగించాలని కోరుతున్న విద్యార్థులు


బండరాళ్లు ఉన్న పాఠశాల పరిసరాలు


పాఠశాల ప్రాంగణంలో బండరాళ్ల సముదాయం

బుగ్గారం: విద్యార్థులు శారీరకంగా,మానసికంగా పరిపూర్ణులుగా ఎదగాలంటే విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరం. విద్య విజ్ఞానాన్ని పెంచితే ఆటలు శారీరక పెరుగుదలతో పాటూ మానసికోల్లాసాన్ని పెంచుతాయి. అందుకే ప్రభుత్వం ప్రతీ ఏటా పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు భారీ నజరానాలు ఇవ్వడం ద్వారా క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తోంది. దీనికోసం పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి. మండలంలోని శెకెల్ల ఉన్నత పాఠశాలలో మైదానం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో పెద్ద బండరాళ్లు ఆటల నిర్వహణకు అడ్డంకిగా మారాయి. చాలాకాలం వరకు పాత భవనంలో కొనసాగిన పాఠశాల 2008 సంవత్సరంలో ప్రస్తుత భవనంలోకి మార్చారు. అయితే నూతన భవనాన్ని నిర్మించేటప్పుడు బండరాళ్లను తొలగించకుండానే ఉన్నత,ప్రాథమిక పాఠశాలలకు చెందిన తరగతి గదుల నిర్మాణం పూర్తిచేశారు. మొత్తం 30.3 గుంటల స్థలంలో పాఠశాల ఉండగా అందులో గదుల స్థలాన్ని మినహాయించి ఉన్న ఖాళీ స్థలంలో సుమారు 300 చదరపు మీటర్ల స్థలంలో బండరాళ్లు ఉన్నాయి. వీటి వలన పిల్లలు ఆడుకునేటప్పుడు కొన్నిసార్లు దెబ్బలు తగిలిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇన్నేళ్లు గడుస్తున్నా వీటిని తొలగించడానికి ఏలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా పాఠశాలలో చదివే విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. శెకెల్ల అనుబంధ గ్రామం రాళ్లపల్లి నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. జాతీయ పండుగల్లాంటి సందర్భాల్లో ఆటలు ఆడించాలంటే ఉన్న కాస్త స్థలంలోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్తు క్రీడాకారులు తయారయ్యేందుకు ప్రధాన వేదికలు పాఠశాలలే.. కానీ పరిస్థితి ఇలాగా ఉంటే తాము ఆటలు ఎలా ఆడుకోవాలని, క్రీడాకారులుగా ఎలా తయారవుతామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పాఠశాలకు ప్రహరీ కూడా లేకపోవడంతో పందులు, పశువులు లోనికి వస్తున్నాయి. దీంతో పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రమవుతోంది. ఇప్పటికైనా బండరాళ్ల తొలగించి క్రీడా మైదానం అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలి



మండలంలోని అనేక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత ఉంది.అనేక పాఠశాలల్లో ప్రహరీలు లేవు. శివారులోని పాఠశాలల ప్రాంగణాలు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించినప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెరుగుతుంది. అధికారులు స్పందించి సమస్యలను తొలగించడానికి చర్యలు చేపట్టాలి.

– సామల్ల కృష్ణ, శెకెల్ల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

మన ఊరు మన బడి,అమ్మ ఆదర్శ పాఠశాల పథకాల కింద ఇప్పటికే పలు పాఠశాలల్లో వివి ధ రకాల మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. సమస్యలున్న పాఠశాలల గురించి ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు,ఎంఈవో

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి


మాట్లాడుతున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాలరూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట సుమంగళి గార్డెన్స్‌లో టీయూడబ్ల్యూజే, ఐజేయూ మూడో మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్యకార్డులు ఇప్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు శేఖర్, మహారాష్ట్ర ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండారపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కోర్టు ఉద్యోగులు

జగిత్యాలజోన్: జిల్లా కోర్టుకు చెందిన ఉద్యోగులు బుధవారం రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో సరిపడా సిబ్బంది లేరని, వెంటనే నియమించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రామడుగు శ్రీనివాస్, ఏవో షఫీ, జనరల్ సెక్రటరీ చారీ, మహిళా ప్రతినిధి శైలజ పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాలు అందజేత


ప్రొసీడింగ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: పట్టణంలోని 28వ వార్డులో అన్నపూర్ణాదేవి ఆలయ అభివృద్ధి పనులకు రూ.1.5 లక్షల నిధులు మంజూరు కాగా, బుధవారం ఎమ్మెల్యే కలవకుంట్ల సంజయ్ ఆలయ కమిటీ సభ్యులకు మంజూరు పత్రాలు అందించారు. రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి ఈ నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహంపై అధికారుల కౌన్సెలింగ్

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో ఓ మైనర్ బాలికకు వివాహ ఏర్పాట్లు చేస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు బుధవారం కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారం క్రితం మైనర్ బాలికకు నిశ్చితార్థం జరిగినట్లు తెలియడంతో బాలికల సంరక్షణ అధికారుల బృందం సభ్యులు శ్రీనివాస్, రామచంద్రం, స్రవంతి బుధవారం గ్రామానికి చేరుకున్నారు. కౌన్సెలింగ్ ఇవ్వడంతో వివాహం చేయబోమని కుటుంబసభ్యులు అంగీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెకు ఉద్యోగుల సంఘీభావం

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన సమ్మెకు పట్టణంలోని ఉద్యోగులు, కార్మికులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ, మున్సిపల్, హమాలీ, భవన నిర్మాణ, మధ్యాహ్న భోజన కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి పాత, కొత్త బస్టాండ్‌ల మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఎల్ఐసీ ఉద్యోగులు సమ్మెకు మద్దతు తెలిపి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమాల్లో టి.శ్రీనివాస్, ప్రభాకర్, బాబుమియా, రత్నాకర్, రాజశేఖర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పథకాల్లో అవకతవకలు జరగకుండా చూడాలి

కొడిమ్యాల: ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో మాట్లాడారు. కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల విషయంపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి చెక్కులు అవకతవకలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కొత్తూరి స్వామి,గడ్డం లక్ష్మారెడ్డి,రాచకొండ చంద్రమోహన్, మహిళ నాయకురాలు గాదె స్రవంతి, ప్యాక్స్ చైర్మన్ రాజేందర్,రొడ్డ శరత్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి తరలిరావాలి

మల్లాపూర్: మండల కేంద్రంలో గురువారం నిర్వహించే బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్,మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత రానున్నారని తెలిపారు. కార్యకర్తలు భారీగా హాజరు కావాలని కోరారు.

ఉచిత పశువైద్య శిబిరం

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆవులు,గేదేలకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీనివాస్, సుష్మ, విశాల్ కుమార్, సురేశ్,మండల పశువైద్యాధికారులు మనీషా అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

లంబాడిపల్లిలో..

మల్యాల: మండలంలోని లంబాడిపల్లిలో మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్‌పర్సన్ ప్రారంభించారు.

ఎస్సై బాధ్యతలు స్వీకరణ

మేడిపల్లి: మండల ఎస్సైగా మాడ శ్రీధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మేడిపల్లిలో ఇంతకుముందు ఎస్సై గా విధులు నిర్వహించిన శ్యాంరాజ్ బదిలీపై నిజామాబాద్ జిల్లా నందిపేటకి బదిలీ కాగా, బుగ్గారం మండల ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి మేడిపల్లికి బదిలీపై వచ్చారు.

ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

మెట్‌పల్లి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి, పన్నాల మాధవరెడ్డి, నాయిని సురేశ్, ముఖీమ్, జాజాల రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

జగిత్యాలటౌన్: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా బుదవారం జగిత్యాల వివేకానంద మినీ స్టేడియంలో ఏబీవీపీ నాయకులు జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి టవర్ మీదుగా వివేకానంద మినీస్టేడియం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ కళామంచ్ నేషనల్ కోకన్వీనర్ మణికంఠబీజేపీ సీనియర్ నాయకుడు ఏసీఎస్ రాజు, మ్యాన మహేశ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్, విష్ణు, మనోజ్, మణిదీప్, సిద్దు, చందు, మణి తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు బుధవారం రాయికల్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రధాన వీధుల గుండా విద్యార్థులు భరతమాత విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బన్న హరీశ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ గుగ్గిళ్ల మనోజ్, కార్యకర్తలు శశి, మనోజ్, రాజు, వంశీ, మనోజ్ పాల్గొన్నారు.

కిరాణాలు, హోటళ్లలో మున్సిపల్ సిబ్బంది తనిఖీ

మెట్‌పల్లి: పట్టణంలోని పలు కిరాణాలు, హోటళ్లలో బుధవారం మున్సిపల్ శానిటేషన్ విభాగం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరాణ దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యాపారుల నుంచి రూ.2 వేలు జరిమానా వసూలు చేశారు. అలాగే హోటళ్లను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట, కుస్తాపూర్, రత్నాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, గైడ్లు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్,హెచ్‌ఎం సత్యం,ట్రస్ట్ సభ్యులు గణేశ్, చింటూ, బన్నీ, ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాధికారులపై దాడులు ఖండించాలి


నిరసన తెలుపుతున్న ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది

సారంగాపూర్: ఆలయాల అధికారులు, సిబ్బందిపై జరుగుతున్న దాడులను ప్రజలు ఖండించాలని, దాడులకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరుతూ దుబ్బరాజన్న ఆలయ ఈవో శిరీష, ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయం ముందు బుధవారం నిరసన తెలిపారు. భద్రాచల ఆలయ కార్యనిర్వహణాధికారిపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన చేపట్టారు. దేవాలయ భూములు ఆక్రమించుకున్న వారి నుంచి ప్రభుత్వం వెనక్కి తీసుకునేలా కఠినమైన చట్టాలు చేయాలని, దీని ద్వారా దేవాలయాల ఆస్తులను రక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈవోతో పాటు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట నుంచి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. ఇటీవలే కురిసిన వర్షాలకు ఈ రోడ్డు గుండా వాహనాలు వెళ్లడం కష్టంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. భూషణరావుపేట రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. ఈ రోడ్డు గుండా కనీసం బైకులు వెళ్లలేని దుస్థితి ఉందని, మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్ ,ఆర్అండ్‌బీ శాఖ ఏఈ, కథలాపూర్, సెల్ నంబర్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఆడ పిల్లలను ఉన్నత విద్య వరకు చదివించాలి


మగ్గిడి పాఠశాలలో అవగాహన ర్యాలీ

ధర్మపురి: ప్రతీ ఆడపిల్లను ఉన్నత విద్య వరకు చదివించితే మంచి ప్రయోజనాలు చేకూరుతాయని మగ్గిడి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. మండలంలోని మగ్గిడి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ సాధికారత బృందం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆడ పిల్లల ఉన్నత చదువులపై కలిగే ప్రయోజనాలపై వివరించారు. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న హత్యా సంఘటనలు, వివక్షతలపై వివరించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సర్వీసెస్, సైబర్ నేరాల గురించి వివరించారు. ముఖ్యంగా 181,1098 హెల్ప్‌లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారత కేంద్ర బృందం, జెండర్ స్పెషలిస్టు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

రాయికల్: ఉపాధ్యాయులకు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలని తపస్ రాష్ట్ర బాధ్యులు ఎలిగేటి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని కిష్టంపేట, అల్లీపూర్,ఆలూరు, తాట్లవాయి భూపతిపూర్ గ్రామాల్లోని పాఠశాలల్లో బుధవారం తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ప్రసాద్‌రావు మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆరోగ్య భద్రత కార్డులు అందించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు మహేశ్వర శర్మ మండల అధ్యక్షుడు కొండూరి రజనీకాంత్, ప్రధాన కార్యదర్శి రాచర్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మాదాసు ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

మెట్‌పల్లి: ప్రభుత్వం సబ్సిడీపై కంది విత్తనాలను అందిస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ సూచించారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం విత్తనాల పంపిణీ ప్రారంభించారు. పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రమేశ్, ఏఈ దీపిక, రైతులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత


ఇబ్రహీంపట్నం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని గండి హనుమాన్ చెక్‌పోస్టు వద్ద బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. కథలాపూర్ నుంచి వస్తున్న లారీలో అనుమతి లేకుండా అక్రమంగా నిజామాబాద్ వైపు ఇసుకను తరలిస్తుండటంతో పట్టుకుని కేసు నమోదు చేసి ఇసుక లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

11న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సారంగాపూర్: విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి బీర్‌పూర్ మండల కేంద్రంలో ఈనెల 11న నిర్వహించే విద్యుత్ పరిష్కార వేదికలో వినియోగదారులు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని బీర్‌పూర్, సారంగాపూర్ ట్రాన్స్‌కో ఏఈలు శ్రీనివాస్, ప్రవీణ్ పేర్కొన్నారు. తెలంగాణ విద్యుత్ వినియోగదారుల పరిష్కారం కోసం నిజామాబాద్ ఎన్పీడీసీఎల్ అధికారులు పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారని, కార్యక్రమంలో బీర్‌పూర్, సారంగాపూర్, జగిత్యాల రూరల్, రాయికల్ మండలాల వినియోగదారులు పాల్గొని వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఎనుగంటి స్వామికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు మంజూరు కాగా, బుధవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గుజ్జుల మోహన్‌రెడ్డి అందజేశారు.



కాకతీయ కాలువకు గండి..

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రం శివారులో కాకతీయ కాలువకు గతేడాది భారీ వర్షాలకు గండి పడింది. ఈ గండిని పూడ్చేందుకు ఎస్సారెస్పీ ఇంజనీరింగ్ అధికారులు గండిని పరిశీలించి పూడ్చేందుకు రూ. 3.9 లక్షల అంచనాలను తయారు చేశారు. ఈ గండిని పూడ్చే పనులు చేపట్టిందుకు 4 జనవరి 2024న టెండర్లు పిలిచారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ 19 నెలలు అవుతున్నా పనులు చేపట్టలేదు. పనులుప్రారంభించాలని సంబంధిత ఏఈ కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చినా కానీ పనులు ప్రారంభించడం లేదు. వర్షాకాలం కాకతీయ కాలువకు పడ్డ గండి మరింత ప్రమాదకారంగా మారే అవకాశాలు ఉన్నాయి. దారికి అడ్డంగా గండి పడటం వలన అటువైపు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే కాకతీయ కాలువకు పడ్డ గండిని ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో పనులు చేయించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.